# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన జనగణన 2027లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్**

2. **దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల స్థానాల సంఖ్య తగ్గకుండా పునర్విభజన ప్రక్రియ జరుగుతోందని స్పష్టం చేసిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి**

3. **రాష్ట్రంలో అనధికార లేఅవుట్‌ల క్రమబద్దీకరణకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలన్న మంత్రి పి. నారాయణ**

4. **ప్రపంచ హీమోఫీలియా అవగాహనా దినాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన జనగణన 2027లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. జనగణ ప్రకియపై గవర్నర్ ఒక వీడియో సందేశం ద్వారా మాట్లాడుతూ, ఈ ప్రక్రియ దేశ రాష్ట్రాల అభివృద్ధికి కీలకమైనదని పేర్కొన్నారు. జనాభా గణనలో పాల్గొనడం, సమాచారాన్ని తెలపడం ప్రతి పౌరుడి బాధ్యత అని గవర్నర్ పేర్కొంటూ,

వాయిస్ 32 సెకన్లు

--------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేంవర్క్- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ సాధించేందుకు కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం కేంద్రంగా ఏర్పాటు చేసిన వ్యాధి పర్యవేక్షణ నిర్ణయ కేంద్రం – డీఎండీసీ కార్యాలయాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు సాధించడం ద్వారా కళాశాలలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో రాష్ట్ర వైద్యుల పరిశోధనలు ప్రచురితమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బోధనాసుపత్రుల అభివృద్ధికి కేటాయించిన నిధుల వినియోగంపై వైద్యాధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల స్థానాల సంఖ్య తగ్గకుండా పునర్విభజన ప్రక్రియ జరుగుతోందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, నియోజకవర్గాల పునర్విభజన ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి నష్టం జరగదని తెలిపారు. నియోజకవర్గాల స్థానాలు పెరగడం వల్ల లోక్‌సభలో దక్షిణ భారతదేశ ప్రాతినిధ్యం మరింతగా పెరుగనుందని కిషన్ రెడ్డి తెలియజేస్తూ...

వాయిస్ 32 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో అనధికార లేఅవుట్ ల క్రమబద్ధీకరణకు అర్హత ఉన్న దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు. పురపాలక, పట్టణప్రణాళిక అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి శ్రవణ మాధ్యమం ద్వారా మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. లేఅవుట్లు ప్లాట్ల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు అనుమతులపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా వెంటనే అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. ఈనెల 23 తో ముగుస్తున్న లేఅవుట్‌ల క్రమబద్ధీ కరణకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని మంత్రి నారాయణ తెలిపారు.

---------------------------

ఇంటర్మీడియట్ లో ఉత్తీర్ణత సాధించని అంబేద్కర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అన్నారు. అందుకోసం ప్రతి జిల్లాలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి చొప్పున రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

---------------------------

ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో " కొండపల్లి బొమ్మల మేళా" ను రేపటి నుంచి నిర్వహిస్తున్నటు జిల్లా కలెక్టర్ జి. లక్ష్మిశ తెలిపారు. కొండపల్లి కోట దిగువన మూడ్రోజుల పాటు నిర్వహించే ఈ మేళాలో మినీ మారథాన్, సైక్లింగ్, యోగా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నటు చెప్పారు. రాష్ట్ర వారసత్వ సంపద గురించి నేటి తరంతో పాటు భావితరాల వారికి తెలియజేయాలనే సంకల్పంతో బొమ్మల మేళాను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలియజేస్తూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

ప్రపంచ హీమోఫీలియా అవగాహనా దినాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫీలియా వ్యవస్థాపకులు ఫ్రాంక్ బల్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఏప్రిల్ 17వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

అరుదైన వ్యాధిగా వైద్య నిపుణులు పేర్కొనే ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి చిన్న గాయం తగిలినా రక్త స్రావం జరుగుతుంది. జన్యు లోపం కారణంగా వారసత్వంగా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ఇటువంటి లోపం వున్న వారు స్క్రీనింగ్ పరీక్ష ద్వారా దీనిని గుర్తించి హిమోఫీలియా వ్యాధిని నియంత్రించ వచ్చని  సూచిస్తున్నారు.

---------------------------

కృష్ణాజిల్లాలో రహదారి ప్రమాదాలను  నియంత్రిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు. కృష్ణాజిల్లాలోని  మచిలీపట్నం నుండి  పెనమలూరు వరకు గల జాతీయ రహదారిపై ప్రమాదాలకు గురయ్యే అవకాశమున్న ప్రాంతాలు – బ్లాక్ స్పాట్స్ ను ఆయన ఈ రోజు  పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలు అధికంగా సంభవించే ప్రాంతాలలో  హెచ్చరిక బోర్డులు, వేగ పరిమితి సూచికలు,  స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.  డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం వంటి నిబంధనలు పాటించని వారిపై  చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 133 వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు,గాని మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు గాని నరేంద్రమోదీ యాప్‌కు గాని ఈ నెల 24వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

పద్మ అవార్డులకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా  కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో  తెలిపారు. భారత హోం మంత్రిత్వ శాఖ ప్రతీ సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ విభూషన్, పద్మ భూషన్, పద్మశ్రీ పురస్కారాలను ప్రకటిస్తుందని చెప్పారు. అందులో భాగంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారిని పద్మ అవార్డులకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆయా రంగాల్లో విశేష ప్రతిభ కనపరచిన వారు తగు అర్హత గల ఔత్సాహికులు  దరఖాస్తులను  జూలై 31లోపు తగిన వివరాలతో awards.gov.in వెబ్ సైట్ నందు సమర్పించాలని కోరారు.

---------------------------

ధర్మవరంలో  చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చి, చేనేత కార్మికుల జీవితాల్లో స్థిరమైన ఉపాధిని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చేనేత  కార్యదర్శితో ధర్మవరం క్లస్టర్ అభివృద్ధిపై నిన్న సమీక్ష నిర్వహించారు.

======================